

# గురువాజ్ఞ

ఒకసారి 'బాబా' తన శిష్యబృందంతో చేరి ఏవో విషయాలపై చర్చిస్తున్నారు. యింకా అక్కడ చాలామంది భక్తులు కూర్చుని ఉన్నారు. బాబా వేపచెట్టుకింద గట్టుమీద కూర్చున్నారు. ఆయన శిష్యులు, భక్తులు బాబాకి ఎదురుగా కిందకూర్చుని ఉన్నారు.

ఈ విధంగా చర్చలు సాగుతున్న సమయాన ఒకతను అతి హీనదశలోనున్న ఒక మేకను బాబా వద్దకు తెచ్చి, ''బాబా అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న ఈ మేకను రక్షింపుము. ప్రాణంపోయే స్థితిలో ఉంది పాపం. మీ దగ్గరకు వచ్చే ఏ ప్రాణికయినా ప్రాణభయం ఉండదన్న నమ్మకంతో నేను ప్రాణంగా పెంచుకునే ఈ మేకను మీ దగ్గరకు తెచ్చాను'' అన్నాడు బాధగా, దాని తలను జాలిగా నిమురుతూ.

అదివిన్న బాబా చిరునవ్వు నవ్వి - ఏ అభయమూ ఇవ్వకపోగా, తన ప్రియశిష్యుడ్ని ''మాలేగాం ఇటురా'' అంటూ పిలిచారు.

అతడు దగ్గరకు వెళ్ళగానే, ''తక్షణం ఈ మేకను ఒక్కవేటున నరికివెయ్యి'' అన్నారు. అది విని అందరూ ఆశ్చర్యపోయారు.

''అనవసరంగా జీవహింస ఎందుకు చేయాలి. పైగా దానిని రక్షించకపోగా'' అని మనసులో ఆలోచించుకొని చేతులు కట్టుకుని తలవంచుకుని నిలబడ్డాడు మాలేగాం.

బాబా అది చూసి, ''శ్యామా నీవు వధింపుము దానిని ఒక్క వేటున నరికి'' అన్నారు మరో శిష్యుని వంక చూస్తూ.

''అలాగే బాబా... ఇప్పుడే వెళ్ళి కత్తి పట్టుకు వస్తాను'' అంటూ వెళ్ళాడు అతను.

కానీ ఎంతసేపటికీ అతను తిరిగి రాలేదు. యింక బాబా లాభంలేదనుకుని ''నాయనా దీక్షిత్, నీవు చేయి ఆ పనిని'' అని ఆజ్ఞాపించారు బాబా, తన మూడవ ముఖ్య శిష్యుడైన దీక్షిత్ అనే బ్రాహ్మణుడికి.

జి. రామలక్ష్మి, హైద్రాబాద్

''అలాగే సాయిరామ్'' అంటూ పరుగు పరుగున పోయి ఒక కత్తిని తెచ్చి దాన్ని నరకటానికి కత్తి పైకి ఎత్తిపట్టుకుని సిద్ధంగా నిల్చున్నాడు, బాబా ఆజ్ఞకోసం ఎదురుచూస్తూ.

''ఊ... నరుకు యింకా చూస్తావేం?'' అన్నారు.

అతడు బలంగా కత్తి ఎత్తి దింపేలోపల ''ఆగు, నీకు సిగ్గులేదూ. బ్రాహ్మణుడివై పుట్టి చివరకు జీవహింసకు కూడా పూనుకున్నావా. నీకు అసహ్యం, పాపభీతి కలగటంలేదూ?'' అన్నారు బాబా.

''లేదు బాబా. గురువాజ్ఞ పాటించటం తప్పితే నాకు వాటికోసం ఆలోచించే పనేలేదు. మీరుండగా పాపచింతనల ఆలోచన నాకేల? మీ ఆజ్ఞే నా కర్తవ్యం'' అన్నాడు దీక్షిత్.

''అయితే నరుకు'' అన్నారు బాబా. దీక్షిత్ అలాగే చేసాడు. కానీ మేక నరకబడలేదు సరి కదా, ఆ కత్తి పూలదండగా మారి మేక తలను అలంకరించుకుంది.

అది చూసి బాబా మహిమలను వేనోళ్ళ కొనియాడుయతూ భక్తులు జేజేలు పలికారు బాబాకి! బాబా అందర్నీ ఆశీర్వదించి, మేకతో ''యిక నీవు వెళ్ళు! నీవచ్చిన పని పూర్తయి నట్లే!'' అంటే అది చెంగున గెంతువేసుకుంటూ పరుగుతీసింది.

అప్పుడు బాబా నవ్వుతూ ''శిష్యులలో మూడు రకాలవారుంటారు. వారిలో తేడాలు ఏవిధంగా ఉండేదీ, అందరూ ఒకేరీతిలో ఉండర నేదీ మీకు తెల్పటానికే నేను ఈవిధంగా పరీక్ష పెట్టి చూపించాను. ఉత్తమ శిష్యుడు మొదటి వాడు. అతడు గురువు చెప్పింది మంచా చెడా అన్నది ఆలోచించక తక్షణమే ఆజ్ఞని పాటిస్తాడు. రెండవవాడు మధ్యమ శిష్యుడు. అతడు గురువు చెప్పింది వినీ, మంచా చెడా అన్నది ఆలోచించిన మీదటగాని ఏ కార్యాన్నీ ఆచరించడు. తరువాత ఇక మూడవవాడు అధమ శిష్యుడు. ఒట్టి మూర్ఖుడన్నమాట. గురువాజ్ఞని ఉల్లంఘిస్తాడు. చేసేవాడిలా వింటాడు. కానీ పాటించడు'' అన్నారు తేడాలను చూపిస్తూ, వివరిస్తూ భక్తులకు.

